

నానాటికీ పాతాళానికి..

మిర్చి ధరలు రోజురోజుకు తగ్గుతుండడంతో అన్ సీజన్‌పై ఆశతో నిల్వ చేసిన రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో



మార్కెట్‌లోనే సీసీఐ కేంద్రం..

ఖమ్మం మార్కెట్‌లోనే సీసీఐ కేంద్రం ఏర్పాటుచేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఖమ్మం రూరల్ మండలం చిన్న వెంకటగిరిలో కులగణన సర్వేను మంత్రి పరిశీలిస్తారు. ఆతర్వాత నేలకొండపల్లి మండలం ఆరెగూడెం, నేలకొండపల్లి, బోదులబండ, పైనంపల్లిల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు. ఆతర్వాత సాయంత్రం 3గంటలకు ఖమ్మం 59, 60వ డివిజన్లలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేయనున్న మంత్రి.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



అభ్యర్థులతో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్

తల్లాడ: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యాన 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల నియామకానికి తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 32మంది అభ్యర్థులు హాజరుకాగా సంస్థ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ దుర్గాప్రసాద్ వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. కాగా, 31మంది ఎంపికకాగా హైదరాబాద్‌లో రెండు నెలల పాటు శిక్షణ అనంతరం టెక్నీషియన్లుగా నియమిస్తామని తెలిపారు. 108 సిబ్బంది టి.కృష్ణ, నర్సింహారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

11 నుండి గురుకులాల జోనల్ స్థాయి క్రీడాపోటీలు



పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్వరూపరాణి, అధికారులు

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 11నుండి జోనల్ స్థాయి బాలికల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాట్లను గురువారం పరిశీలించిన అనంతరం ఆమె వివరాలు వెల్లడించారు. పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 14 గురుకులాల నుంచి 1,190 మంది బాలికలు హాజరవుతారని తెలిపారు. అండర్–14, 17, 19 విభాగాల్లో విభాగాల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఈకార్యక్రమంలో డీపీఓ రాజ్యలక్ష్మి, వైరా, ముదిగొండ ప్రిన్సిపాళ్లు డాక్టర్ డి.సమత, ఐనాల సైదులుతో పాటు ఉద్యోగులు సంజీవరెడ్డి, దేవజ్యోతి, పద్మావతి, లిల్లీ, జ్యోతి, మైథిలి, స్వరూప పాల్గొన్నారు.

వరంగల్ రీజియన్‌లో 196 సీసీఐ కేంద్రాలు



పత్తిని పరిశీలిస్తున్న జేడీఎం శ్రీనివాసరావు

ఏన్కూరు: సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు వరంగల్ రీజియన్ పరిధిలో 196 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఏన్కూరులోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం సందర్శించిన ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు తొమ్మిది సీసీఐ కేంద్రాలు మొదలయ్యాయని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 501 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేశామన్నారు. రైతులు దళారులకు అమ్మకుండా సీసీఐ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ వి.పద్మావతి, డీఎంఓ అబ్దుల్ అలీం, ఏన్కూరు మార్కెట్ కార్యదర్శి బజార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల పరిశీలన

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలను గురువారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో తేమ శాతం నిర్ధారణకు యంత్రాలు వినియోగించాలని, ధరలో రైతులకు నష్టం జరగకుండా చూడాలని ఉద్యోగులకు సూచించారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండితులు కారట...

హిందీ పండిట్ల విషయంలో ఏడుగురు అనర్హులుగా నిర్ధారణ

- పలువురి ఫిర్యాదుతో విచారణ చేయించిన కలెక్టర్
- ఏడుగురి తొలగింపు.. ఆతర్వాత స్థానాల్లో వారికి పోస్టింగ్
- డీఎస్సీ – 2024 నియామకాల్లో వెల్లడైన లోపాలు
- విద్యాశాఖ అధికారుల తీరుపై విమర్శల వెల్లువ



డీఈఓ సోమశేఖరశర్మతో వాగ్వాదానికి దిగిన తొలగింపునకు గురైన అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ – 2024 నియామకాలు సాఫీగా ముగిశాయని అంతా భావిస్తున్న తరుణాన విద్యాశాఖ అధికారుల తప్పిదాలు బయటపడుతున్నాయి. అభ్యర్థుల అర్హతలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనర్హులకు పోస్టింగ్ ఇవ్వగా... విషయం బయటపడడంతో వారిని తొలగించాల్సి వచ్చింది. అనర్హులుగా తేలిన వారిని తొలగించి, ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చి అంతా అయిపోయిందని చెబుతున్న అధికారులు వారి నిర్లక్ష్యంపై మాత్రం పెదవి విప్పకపోవడం గమనార్హం. మరోపక్క డీఎస్సీ – 2008లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో తప్పులు దొర్లాయని రెండోసారి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టడం విద్యాశాఖ పనితీరును తెలియచేస్తోంది. కాగా, తొలగింపునకు గురైన అభ్యర్థులు గురువారం డీఈఓ కార్యాలయానికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో వదిలేసి ఇప్పుడు సంతోషంగా ఉద్యోగం చేస్తున్న తమను తొలగించడం అన్యాయమని వాపోయారు.

ముందే చెప్పినా...

2024 డీఎస్సీకి సంబంధించి జిల్లాలో 516 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించింది. దీంతో పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఖమ్మం రోటరీనగర్ హైస్కూల్‌లో చేపట్టారు. ఈ మేరకు లాంగ్వేజ్ పండిట్(హిందీ)కి సంబంధించి కొందరి సర్టిఫికెట్లపై అప్పుడే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినా అధికారులు తోసిపుచ్చినట్లు సమాచారం. ఆపై ఎవరెటు వెళ్తే తమకేమిటి అన్నట్లుగా అన్నట్లుగా పోస్టింగ్‌లు ఇచ్చేశారు.

కలెక్టర్ దృష్టికి సమస్య

లాంగ్వేజ్ పండిట్(ఎల్‌పీ) హిందీ పోస్టులకు ఎంపికైన వారిలో ఏడుగురు అనర్హులున్నారని పలువురు అభ్యర్థులు విద్యాశాఖ ఉన్నతాధికారులు, డీఈఓకు ఫిర్యాదు చేయడమే కాక ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఇంకో శాఖ అధికారితో విచారణ జరిపించారు. తాజాగా నివేదిక అందగా ఏడుగురు అభ్యర్థులకు అర్హత లేకున్నా పోస్టింగ్ ఇచ్చినట్లు బయటపడింది.

గత నెల 16నే విధుల్లోకి..

గత నెల 2నుంచి 5వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఆతర్వాత ఎంపిక చేసిన 516మందికి 10వ తేదీన హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందజేశారు. ఆపై జిల్లా కేంద్రంలో కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఇవ్వగా 16వ తేదీన వారంతా విధుల్లో చేరారు. ఇంతలోనే ఏడుగురిని అనర్హులుగా నిర్ధారించి బుధవారం రాత్రి తొలగించడం(టెర్మినేషన్)తో పాటు గురువారం ఉదయం ఆతర్వాత స్థానాల్లో ఉన్న వారికి పోస్టింగ్ ఇచ్చారు.

నిబంధనలు ఇలా...

డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఏ పోస్టుకు ఎవరు అర్హులో స్పష్టంగా పేర్కొన్నారు. అయినా సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా అధికారులు జాగ్రత్తలు పాటించకపోవడం ఈ గందరగోళానికి కారణమైంది. అధికారుల తప్పిదంతో హిందీ పండిట్ పోస్టుకు సరైన అర్హతలు లేకున్నా వారికి పోస్టింగ్ దక్కినట్లు తెలుస్తోంది. కాగా, లాంగ్వేజ్ పండిట్(ఎల్‌పీ) హిందీ పోస్టుకు హిందీ పండిట్ శిక్షణతో పాటు ఎంఏ హిందీ కలిగి ఉండడమే కాక డిగ్రీలో మూడు ఆప్షన్లలో హిందీ సబ్జెక్టు ఉండడం తప్పనిసరి అని నిబంధనల్లో పొందుపరిచారు. కానీ ఇప్పుడు అనర్హత వేటు పడిన ఏడుగురికి హిందీ పండిట్ శిక్షణ మాత్రమే ఉండి మిగతావేవీ లేకపోవడంతో తొలగించినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

▶▶ తొలగించింది వీరినే : అర్హతలు లేకపోవడంతో తొలగించిన వారి జాబితాలో మాయరి నాగేశ్వరరావు(మధిర సీపీఎస్), సట్టు రామలింగయ్య(బనిగండ్లపాడు), షేక్ నాగుల్ మీరా(కందుకూరు జెడ్పీహెచ్ఎస్), దొర్నాల లావణ్య(చిలుకూరు జెడ్పీహెచ్ఎస్), తాటికొండ నాగలక్ష్మి(పాలేరు జెడ్పీహెచ్ఎస్), తాటికొండ శ్రీదేవి(రేమిడిచర్ల జెడ్పీహెచ్ఎస్), మొండేటి వెంకటరత్నం(తుమ్మలపల్లి జెడ్పీహెచ్ఎస్) ఉన్నారు.

▶▶ కొత్తగా పోస్టింగ్ పొందిన ఉపాధ్యాయులు : తొలగింపునకు గురైన వారి స్థానాన జాబితాలో ఉన్న వారికి పోస్టింగ్ ఇచ్చారు. కొత్త ఉపాధ్యాయుల్లో జేవీ.శ్యాంప్రసాద్(రాజుపాలెం జెడ్పీఎస్ఎస్), ఎండీ.రజీ(చిలుకూరు జెడ్పీహెచ్ఎస్), ఎస్.కే.షాలీనా బేగం(న్యూలక్ష్మీపురం, జెడ్పీఎస్ఎస్), పి.పద్మ(తుమ్మలపల్లి జెడ్పీఎస్ఎస్), డి.నాగేశ్వరరావు(పాలేరు జెడ్పీఎస్ఎస్), ఈశ్వరీభాయి(మధిర జీహెచ్ఎస్), ఎన్.రాంప్రసాద్(బనిగండ్లపాడు జెడ్పీహెచ్ఎస్) ఉన్నారు.

ఔను.. తప్పిదం జరిగింది..



2024–డీఎస్సీలో హిందీ పండిట్లుగా ఎంపికైన ఏడుగురిని అనర్హులుగా గుర్తించాం. వీరిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించి ఆ తర్వాత స్థానంలో ఉన్న వారికి పోస్టింగ్ ఇచ్చాం. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలోనే తప్పిదం జరిగింది. సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులపై ఆర్‌జేడీకి నివేదిక పంపించాం.

– ఈ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- చింతకాని, బోనకల్ మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చింతకాని : నాగులవంచలో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం

చింతకాని: రాష్ట్రంలోని తమ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా ప్రణాళిక రూపొందించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రూ.8.90 కోట్ల సీఆర్ఆర్ నిధులతో చేపట్టే బీటీ రహదారుల నిర్మాణాలకు ఆయన చింతకాని మండలం నాగులవంచలో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాక ఉపాధ్యాయుల నియామకం చేపట్టామన్నారు. అంతేకాక మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని చెప్పారు. ఇవేకాక అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యనందించేలా నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుచేస్తున్నామని భట్టి తెలిపారు. కాగా, బీటీ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు.

రూ.15కోట్లతో బీటీ రోడ్డు విస్తరణ పనులు

బోనకల్: బోనకల్ నుంచి రాయన్నపేట వరకు 9కిలోమీటర్ల మేర రూ.15కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు విస్తరణ పనులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో లింక్ రహదారులు నిర్మిస్తూనే డబుల్ రోడ్డు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు పలు సమస్యలపై డిప్యూటీ సీఎంకు విన్నవించగా తొలుత మహిళలు హారతులతో ఆయనకు స్వాగతం పలికారు. అలాగే, గోవిందాపురం(ఏ) గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత,, ఆర్డీఓ నర్సింహారావు, ఈఈ తానేశ్వర్, డీఈ శంకర్‌రావు, ఎంపీడీఓ రమాదేవి, తహసీల్దార్లు కూరపాటి అనంతరాజు, పున్నంచందర్‌తో పాటు నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోని, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున్, ఆలస్యం బస్వయ్య, పైడిపల్లి కిశోర్, గాలి దుర్గారావు, ఆంతోటి వెంకటేశ్వర్లు, మరీదు శ్రీను, పిల్లలమర్రి నాగేశ్వరావు, కర్నాటి కోటి, మోదుగు సుధీర్‌బాబు, సైదానాయక్, బీ.పీ.నాయక్, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 51 మిల్లుల ఖరారు
- 15రోజుల్లో బ్యాంకు గ్యారంటీ ఇచ్చేలా ఒప్పందం
- ముందుకు రాని మరో 11 మంది మిల్లర్లు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు మొదలుకానున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొస్తున్న ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండడం, ప్రభుత్వ నిబంధనలు తమకు ఇబ్బందిగా ఉన్నాయని మిల్లర్లు ముందుకు రాకపోవడంతో ఇప్పటి వరకు గింజ కూడా కొనలేదు. ఈనేపథ్యాన జిల్లాలోని 66 రైస్ మిల్లుల్లో 51 మిల్లుల యాజమాన్యాలు సుముఖత వ్యక్తం చేస్తూ పౌరసరఫరాల సంస్థకు అండర్ టేకింగ్ ఇచ్చాయి. రానున్న పదిహేను రోజుల్లో బ్యాంకు గ్యారంటీ ఇస్తామనే ఒప్పందంతో ధాన్యం అప్పగింతకు అధికారులు నిర్ణయించారు.

రైతుల గగ్గోలు

జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 323 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేయాలని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. ఇందులో సన్న ధాన్యం సేకరణకు 268, దొడ్డు ధాన్యానికి 55 కేంద్రాలను ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లాలో 180 కేంద్రాలను తెరిచినట్లు చెబుతుండగా, సాగర్ ఆయకట్టులో కోతలు కూడా మొదలయ్యాయి. కానీ రైతులు తీసుకొచ్చిన ధాన్యం మాత్రం కొనడం లేదు. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు నిబంధనలు విధించడంతో వారు ముందుకు రాలేదు. ఈనేపథ్యాన రైతుల ఆందోళన, ప్రభుత్వ ఒత్తిడితో ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం స్వీకరణకు మిల్లర్లు కదిలారు. జిల్లాలో గురువారం సాయంత్రానికి 51 మిల్లులకు పౌర సరఫరాల సంస్థ అనుమతి జారీ చేసింది.

నాడు 66.. నేడు 51 మిల్లులు

జిల్లాలోని 17 మండలాల్లో సాగర్ ఆయకట్టు ఉండగా ప్రధానంగా వరి సాగవుతుంది. ఈ సీజన్‌లోనూ 2.50 లక్షల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేశారు. ఏటా జిల్లాలోని 66 మిల్లులకు ధాన్యం కేటాయిస్తారు. అయితే ఈ సారి 51 మిల్లులే అంగీకారం తెలపడం గమనార్హం. గత సీజన్‌లో గడువులోగా సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వకపోవడంతో కొన్నింటిని, అవకతవకలకు పాల్పడడంతో నాలుగు మిల్లులను ప్రభుత్వం డీఫాల్ట్‌గా గుర్తించింది. మిగతా మిల్లులు పది శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వకపోవడంతో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఇప్పటివరకు అనుమతి జారీ చేయలేదు. ఏదిఏమైనా శుక్రవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు మొదలుపెట్టి, మిల్లులకు తరలించనుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ప్రమాదరహితంగా తీర్చిదిద్దుదాం..



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి, పక్కన డైరెక్టర్లు, అధికారులు

- అంతరాయాలను తగ్గిస్తే నాణ్యమైన విద్యుత్
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం రూరల్: జిల్లాను విద్యుత్ ప్రమాదరహితంగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులంతా కృషి చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. ఖమ్మం టీటీడీసీ భవన్‌లో సోమవారం నిర్వహించిన సర్కిల్ స్థాయి అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వర్తిస్తే అంతరాయాలను తగ్గించొచ్చని, తద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. ఇదే సమయాన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు కూడా జరగవన్నారు. ఉద్యోగులు వారి పరిధిలో సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పొలంబాట కార్యక్రమాన్ని మరింతగా విస్తృతంగా చేపట్టాలని సీఎండీ సూచించారు. ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు సుందర్‌లాల్, బి.అశోక్, మధుసూదన్‌రావు, సీఈ కిషన్, ఎస్ఈ ఏ.సురేందర్, డీఈ చినబాబు రావు, అధికారులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడబోం...

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో కొందరు ఉద్యోగులు ప్రతీ పనికి డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తుండడంతో సీఎండీ వరుణ్‌రెడ్డి దృష్టి సారించారు. ఈమేరకు ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఉద్యోగులు, కార్మికులతో ఈ విషయాన్ని ప్రస్తావించడమే కాక అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా 'సంస్థకు చెందిన ప్రతీ వినియోగదారుడికి సమగ్రమైన నిస్వార్థత, అవినీతి రహిత, సత్ప్రవర్తనతో కూడిన సేవ చేయడం నా విధి, ధర్మం. ఈ సంస్థకు చెందిన అన్ని రకాల ఆస్తులను కాపాడడం, వాటి భద్రత, నిర్వహణను అత్యంత శ్రద్ధతో నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా నిర్వర్తించడం నా ముఖ్య విధి. నేను ఎక్కడ లంచం తీసుకోనని, ఇవ్వనని, సంస్థలో ఆదర్శంగా నిలుస్తానని, విధి నిర్వహణను నిజాయితీగా, పారదర్శకంగా నిర్వర్తిస్తానని ఎలాంటి అవినీతికి పాల్పడబోనని ఆత్మ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.' అని అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో సీఎండీ ప్రతిజ్ఞ చేయించారు.

పీహెచ్‌సీల్లో మందుల పట్టిక తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ప్రతీ పీహెచ్‌సీలో మందుల వివరాలతో పట్టిక, సిటిజన్ చార్టర్, ఉద్యోగుల వివరాలు ప్రదర్శించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతి బాయి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో గురువారం సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూనే, ఆస్పత్రుల్లో అందే సేవలను హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు.అలాగే, గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని, వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు అమలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. అసంక్రమణ వ్యాధుల పరీక్షలు, చికిత్స, మందుల పంపిణీలో లోపాలు ఎదురుకాకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు చందునాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సమగ్ర సర్వే

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. సర్వే నిర్వహణపై గురువారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రెండు రోజులు ఇళ్లకు స్టిక్కర్లు వేసినందున శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ మొదలుపెట్టాలని తెలిపారు. ఎన్యూమరేటర్లు పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తిస్తూ పక్కాగా వివరాలు తెలుసుకునేందుకు సూచనలు చేయాలని చెప్పారు. ఇందులో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించచారు. అనంతరం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడగా డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

77.18శాతం...

సర్వేలో భాగంగా బుధ, గురువారం వంద శాతం ఇళ్లకు స్టిక్కర్లు వేయాలని అధికారులు నిర్ణయించారు. 2011జనాభా లెక్కల ప్రకారం 5,36,335 ఇళ్లను గుర్తించాల్సి ఉండగా రెండు రోజుల్లో 4,13,961ఇళ్లను గుర్తించగా 77.18శాతం నమోదైంది. శుక్రవారం నుంచి మిగిలిన ఇళ్లను గుర్తిస్తూనే సర్వే ద్వారా వివరాలు నమోదు చేయనున్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు 4,381 దరఖాస్తులు

2019 ఎన్నికలతో పోలిస్తే ఎక్కువే...



ఖమ్మం సహకారనగర్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు గడువు ముగిసింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో అర్హులైన వారి నుంచి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబర్ 30వ తేదీన మొదలైన దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6వ తేదీతో ముగియగా 4,381 మంది దరఖాస్తులు సమర్పించారు.

అత్యధికంగా ఆన్‌లైన్‌లోనే...

జిల్లావ్యాప్తంగా అందిన 4,381 దరఖాస్తుల్లో ఆన్‌లైన్‌లో 4,305 మంది సమర్పించారు. ఇక నేరుగా తహసీల్, ఆర్డీవో కార్యాలయాల్లో 76 మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇవన్నీ వివిధ స్థాయి పరిశీలనలో ఉండగా ఇప్పటివరకు 23 దరఖాస్తులను తిరస్కరించారు. కాగా, 2019వ సంవత్సరంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3,634మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఈసారి 4,381దరఖాస్తులు అందడం విశేషం. అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేయడమేకాక ఉపాధ్యాయ సంఘాల నుంచి నేతలు బరిలో నిలవనుండడంతో అవగాహన కల్పించగా దరఖాస్తుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది.

రూ.10 కోట్ల మద్యం అమ్మకాలు

వైరా: వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి గురువారం ఒకేరోజు రూ.10కోట్ల విలువైన మద్యాన్ని వ్యాపారులు తీసుకెళ్లారు. రెండు రోజులుగా సర్వర్ పని చేయకపోవడంతో అమ్మకాలు నిలిచిపోయిన విషయం విదితమే. గురువారం ఉదయానికి సర్వర్ అందుబాటులోకి రావడంతో ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్ల యజమానులు మద్యం కోసం వాహనాలతో బారులు దీరారు. దీంతో ఒకేరోజు రూ.10.69కోట్ల విలువైన 13,940 కేసుల మద్యం, 10,013 కేసుల బీర్లను తీసుకెళ్లారు.

కొనసాగిన పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ – 2008లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజైన గురువారం కూడాకొనసాగింది. ఈసందర్భంగా మైదాన ప్రాంతం అభ్యర్థుల్లో 65మంది, ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులు 47మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఐటీడీఏ విద్యార్థులు



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు

పాల్వంచరూరల్ : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన విద్యార్థుల క్రీడా పోటీల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 248 మంది విద్యార్థులు హాజరైన విషయం విదితమే. బాల బాలికలకు కిన్నెరసాని, కాచనపల్లి క్రీడా పాఠశాలల్లో వారం పాటు శిక్షణ ఇవ్వగా ప్రతిభ చాటి ఐటీడీఏకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. ఐటీడీఏల పరిధిలో ఇప్పటివరకు ఐదుసార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా, ఉమ్మడి జిల్లా విద్యార్థులు నాలుగుసార్లు ప్రథమ స్థానంలో నిలవడం విశేషం.

ఈ క్రీడల్లో విజేతలుగా..

అండర్ –14, 17 వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలవగా, టెన్నికాయిట్‌లో అండర్– 14 జట్టు తృతీయ స్థానం, అండర్ –17 జట్టు ప్రథమ స్థానం సాధించాయి. ఇక చదరంగంలో ప్రథమ, ద్వితీయ, క్యారమ్స్‌లో అండర్– 14 విభాగం ప్రథమ బహుమతి గెలుచుకున్నాయి. ఇంకా 100, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 400 మీటర్ల పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచారు. హైజంప్, లాంగ్‌జంప్‌లోనూ ప్రథమ స్థానం సాధించి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. వాలీబాల్ అండర్ –14 బాలుర విభాగంలో ప్రథమ, అండర్ –17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. కబడ్డీ, ఆర్చరీ అండర్ 14, 17 విభాగాల్లో ప్రథమ, ఖోఖోలో అండర్ –14 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. టెన్నికాయిట్‌లో అండర్ 14, 17 విభాగాల్లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. చెస్‌లో అండర్ –17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారు.

క్లుప్తంగా

ఎకరానికి రూ.40 లక్షలు పరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ రాజేశ్వరి

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు ఎకరానికి రూ.40 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఏన్కూరులోని రైతు వేదికలో గురువారం టీఎల్‌పేట, నాచారం రెన్యూ గ్రామాల నిర్వాసితులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) ఎం.రాజేశ్వరి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం 110 మందికి చెందిన 130 ఎకరాల్లో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే కాల్వ తవ్వారన్నారు. కనీస సమాచారం లేకుండా కాల్వ తవ్వకాలు చేపట్టిన అధికారులపై చర్యలు తీసుకోవడమే కాక ఎకరానికి రూ.40లక్షలు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. అనంతరం ఇదేవిషయమై తహసీల్, పోలీస్‌స్టేషన్‌లోనూ వినతిపత్రాలు అందజేశారు.

ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో కొనసాగుతున్న శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైర్మన్ నిష్టాశర్మ తెలిపారు. హైస్కూల్ విద్యార్థులకు ఫిజిక్స్ బోధించేందుకు పీజీ కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు kpmhskmm@gmail.com మెయిల్‌కు ఈనెల 11లోగా దరఖాస్తులు పంపించాలని, వివరాలకు 94405 25093 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీసీఆర్‌బీ ఏసీపీగా రవీందర్‌రెడ్డి

ఖమ్మంక్రైం: సీసీఆర్‌బీ ఏసీపీగా పి.రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఏసీపీగా ఉన్న ప్రసన్నకుమార్‌కు మెదక్ డీఎస్పీగా బదిలీ చేయగా, ఆ స్థానంలో ఉన్న రవీందర్‌రెడ్డిని ఖమ్మంకు కేటాయించారు. ఈ మేరకు డీజీపీ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

10న వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఈనెల 10వ తేదీన అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.డీ మూసీకలీం తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 98483 41238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రూపే కార్డుల చోరీ కేసులో నలుగురి రిమాండ్

- అప్పటి సీఈఓ, ఉద్యోగి కూడా పాత్రధారులే

తల్లాడ: తల్లాడ సొసైటీలో రైతులకు చెందిన రూపే కార్డుల చోరీ, నగదు డ్రా చేసిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు గురువారం వైరా సీఐ ఎన్.సాగర్ వెల్లడించారు. 2018 సంవత్సరంలో రూపే కార్డులను మల్లవరానికి చెందిన సొసైటీ సభ్యులు దుగ్గిదేవర వెంకటకృష్ణారావు, బిల్లంకొండ చిన్న సైదులు తల్లాడ సొసైటీ నుంచి దొంగలించారు. వీరికి అప్పటి సీఈఓ వజ్రాల వీరారెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ దుండేటి సత్యనారాయణరెడ్డి సహకరించగా వివిధ ఏటీఎంల ద్వారా రూ.40.56 లక్షలు డ్రా చేశారు. ఈమేరకు తొలుత వెంకటకృష్ణారావు, బిల్లంకొండ చిన్న సైదులుపై ప్రస్తుత సీఈఓ నాగబాబు ఫిర్యాదు మేరకు మంగళవారం తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆతర్వాత సీఐ విచారించగా వీరారెడ్డి, సత్యనారాయణరెడ్డి పాత్ర కూడా ఉందని తేలడంతో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు మీదుగా అక్రమంగా తరలిస్తున్న ఏడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పిండిప్రోలుకు చెందిన మడికంటి రాము తెట్టెలపాడులో రేషన్ బియ్యాన్ని సేకరించి 18 బస్తాల్లో రవాణా చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ మేరకు పోలీసులు స్వాధీనం చేసుకోగా, సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,350	4,000
కందులు	7,500	7,500
మిర్చి	17,100	7,000
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	18,000	8,000
ఏసీ తాలు	9,000	9,000
పత్తి	6,825	5,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,144

తేడా రూ.5వేలకు పైగానే..



ఈ రైతు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం రాంపురానికి చెందిన సిరిమర్రి శ్రీను. ఎకరంన్నరలో మిర్చి సాగు చేస్తే 31 బస్తాల దిగుబడి వచ్చింది. జనవరిలో మొదటి కోత పంట ఐదు క్వింటాళ్లను రూ.19 వేల చొప్పున ఖమ్మం మార్కెట్‌లో విక్రయించాడు. రెండో కోత పంటను గ్రామంలో ఓ వ్యాపారి రూ.20 వేలకు అడిగినా ఇవ్వకుండా ఖమ్మం తీసుకొచ్చాడు. ఇక్కడ వ్యాపారి క్వింటాకు రూ. 21 వేలు చెల్లిస్తామన్నప్పటికీ అన్‌సీజన్‌లో రూ.25 వేలకు చేరుతుందనే నమ్మకంతో నిల్వ చేశాడు. అయితే, జూన్ నుంచి ధర తగ్గుతున్నా భార్య చికిత్స కోసం అమ్మకానికి తీసుకొస్తే క్వింటాకు రూ.15,500లే నమోదైంది. ధర రూ.5వేలకు తోడు నిల్వ ఖర్చులు కలిపి రూ.6,500 వరకు నష్టపోతున్నా చేసేదేం లేక అమ్ముకుని ఇంటిముఖం పట్టాడు.



ఖమ్మంలోని ఓ కోల్డ్ స్టోరేజీ వద్ద మిర్చి బస్తాలు

నానాటికీ పాతాళానికి..

మిర్చి ధర తగ్గుతుండడంతో రైతుల్లో ఆవేదన

- రూ.16,300కు పడిపోయిన మోడల్ ధర
- ఫలితంగా కోల్డ్ స్టోరేజీల్లో తరగని నిల్వలు
- ఎగుమతులు లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు

మిర్చి ధర గణనీయంగా పతనమవుతోంది. ఈ రెండు, మూడు రోజుల్లో ధర బాగా పడిపోయింది. పంట సీజన్‌లో గరిష్టంగా క్వింటాకు రూ.22 వేల వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.18 వేలకు మించడం లేదు. సీజన్‌లో మోడల్ ధర రూ.19 వేల వరకు పలకగా ఇప్పుడు రూ.16,300గా నమోదవుతోంది. సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం క్వింటాకు రూ.5వేల మేర తేడా ఉండడంతో పంట నిల్వ చేసిన రైతులు, వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. విదేశీ ఎగుమతులు మందగించడమే ఇందుకు కారణమని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. – ఖమ్మం వ్యవసాయం

ఈ ఏడాది మిర్చి గరిష్ట ధరలు (రూ.ల్లో)

నెల	ధర
జనవరి	20,000
ఫిబ్రవరి	21,500
మార్చి	22,000
ఏప్రిల్	20,000
మే	19,500
జూన్	20,000
జూలై	19,500
ఆగస్టు	19,500
సెప్టెంబర్	19,000
అక్టోబర్	18,800
నవంబర్	18,000

నిల్వ చేసి నష్టాల పాలు

ఈ ఏడాది పంట సీజన్‌లో సగటున రూ.20 వేల వరకు ధర పలకగా అన్ సీజన్ రూ.25 వేలకు చేరుతుందని అంతా ఆశించారు. ఈ క్రమాన వ్యాపారులు, రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తే వారి అంచనాలు తారుమారయ్యాయి. రూ.22 వేలు మొదలు రూ.19 వేల వరకు ధర ఇటీవల పతనమవటం ప్రారంభమైంది. ప్రస్తుతం సాగు అవసరాలకు నగదు అవసరమై రైతులు నిల్వ చేసిన మిర్చిని విక్రయించాలని వస్తే ధర చూసి గగ్గోలు పెడుతున్నారు.

పొరుగు రాష్ట్రాల్లో కొత్తమిర్చి

ఇప్పటికే మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఈ ఏడాది సాగు చేసిన మిర్చి విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడి మిర్చి తగ్గడానికి ఇది ఓ కారణమని తెలుస్తోంది. డిసెంబర్ నుంచి ఇక్కడ కొత్త మిర్చి విక్రయాలు మొదలవుతాయి. తద్వారా నిల్వ మిర్చి ధర మరింతగా పడిపోయే అవకాశముంది. కాగా, ఈ ఏడాది విదేశీ ఎగుమతులు గణనీయంగా తగ్గాయి. ఇక్కడ పండించే 'తేజా' రకం మిర్చికి చైనా, బంగ్లాదేశ్, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాల్లో డిమాండ్ ఉన్నప్పటికీ ఈసారి ప్రధానంగా చైనా నుంచి ఆర్డర్లు లేకపోగా.. ఎగుమతిదారులు దేశీయ వ్యాపారమే చేస్తున్నారు. కొందరు బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నా అదీ తక్కువగానే ఉంటోంది.

నిల్వ మిర్చి అలాగే...

జిల్లాలో 40 కోల్డ్ స్టోరేజీలు ఉండగా, వీటిలో 40 లక్షల బస్తాల మేర నిల్వ చేయొచ్చు. ఈ ఏడాది అన్ని కోల్డ్‌స్టోరేజీలు నిండగా.. గత ఐదు నెలల్లో 20 లక్షల బస్తాల మిర్చి మాత్రమే అమ్మకం జరిగింది. అంటే మరో 20 లక్షల బస్తాల మిర్చి నిల్వ ఉండడం గమనార్హం. సీజన్‌తో పోలిస్తే క్వింటాకు రూ.5 వేల వరకు ధర తగ్గినా కొనే వారు లేక రైతులు దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

మిర్చి కొనలేని పరిస్థితి...



పంటకు డిమాండ్ లేక కొందరు వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. విదేశీ ఎగుమతులు లేకపోవడమే ప్రధాన కారణం. ధరపై ఆశతో రైతులతో పాటు వ్యాపారులు కూడా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. అన్ సీజన్‌లో ధర పడిపోతుండడం ఇదే మొదటిసారి. ఈ కారణంగా రైతులతో పాటు వ్యాపారులు భారీగా నష్టపోతున్నారు.

– యర్లపల్లి సతీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి, ఖమ్మం

కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదు

సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఎక్కడ కూడా కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. సీపీఐ వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా గురువారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో పార్టీ సభ్యత్వాలు, పునరుద్ధరణ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిజానికి మరణం లేదని.. దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులకు ఆయన పార్టీ సభ్యత్వం అందజేశారు.

విప్లవస్ఫూర్తి అజరామరం

అక్టోబర్ విప్లవ స్ఫూర్తి, అజేయం, అజరామరమని సీపీఐ జాతీయ సమితిసభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలో గురువారం అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం, లెనిన్ శతవర్ధంతి సభ నిర్వహించగా ఆయన మాట్లాడారు. సీపీఐ వందేళ్ల సంబురాలతో పాటు లెనిన్ శతవర్ధంతి సభలు గ్రామగ్రామాన నిర్వహించాలని పిలుపునిచ్చారు. తొలుత పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. ఈసమావేశంలో పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు శింగు నర్సింహారావు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు, పక్కన నాయకులు

సర్వే ఫామ్‌లో యాదవులుగా రాయించుకోవాలి

ఖమ్మంఅర్బన్: రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో యాదవులు ఫామ్‌లోని కులం వద్ద యాదవ్‌గా నమోదు చేయించుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు సూచించారు. ఖమ్మం రోటరీనగర్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సర్వే వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, బీసీల స్థితిగతులు వెల్లడి కానుండడంతో న్యాయపరమైన హక్కులు సంక్రమించే అవకాశముందని తెలిపారు. కాగా, గతంలో యాదవులకు ఇచ్చిన ఇచ్చిన సంచార జాతుల సర్టిఫికెట్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య, నాయకులు చిత్తారు సింహాద్రియాదవ్, పాదిల సతీష్, సత్తి వెంకన్నయాదవ్, వాగదాని కోటేశ్వరరావు, పాదిలి భూపతి, కంకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబు

రహదారి నిర్మాణ విషయంలో వివాదం

నేలకొండపల్లి: రహదారి నిర్మాణం విషయంలో రైతులు రెండు వర్గాలుగా విడిపోవడంతో వివాదం నెలకొంది. మండలంలోని తిరుమలాపురం నుంచి బైరవునిపల్లి చెరువు వద్దకు 2.5 కి.మీ. మేర డొంక రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే, రెండు వైపులా సమానంగా కాకుండాఓ పక్క ఎక్కువగా వేస్తున్నారని, తద్వారా జీవనాధారమైన పంట కాలువ పూడుకుపోయిందని కొందరు ఆరోపించారు. రైతుల ఆందోళనతో కాల్వ తీసేందుకు కాంట్రాక్టర్ గురువారం పని మొదలుపెట్టగా మరికొందరు అడ్డుకున్నారు. ఇలా రెండువర్గాల మధ్య మొదలైన వివాదం తోపులాటకు దారి తీయగా కాంట్రాక్టర్ పని ఆపేశాడు. ఈవిషయం తెలుసుకున్నఆర్‌అండ్‌బీ ఈఈ యుగంధర్, జేఈ దేవేందర్ చేరుకుని నచ్చచెప్పినా వినకపోవడంతో వెనుదిరిగారు.

రాజేశ్వరపురంలో...

మండలంలోని రాజేశ్వరపురంలో కూడా ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఏటా మాదిరిగానే ఈనెల 12నుంచి గ్రామంలో ఓ వర్గం నాయకులు ఎడ్ల పోటీలు, ఇంకో వర్గం వారు మహిళ కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తామని ఇద్దరూ కోరడంతో ఎటూ తేల్చేకోలేక అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో ఎడ్లపోటీల నిర్వహణకు ఎంపిక చేసిన స్థలంలో గురువారం మాజీ సర్పంచ్ వర్గీయులు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో ఎదుటి వర్గానికి చెంది యర్రబోయిన నర్సయ్య అనుయాయులు నిలదీయడంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు గ్రామస్తులు పలువురు సర్దిచెప్పడంతో ఆందోళన సద్దుమణిగినా ఎప్పుడేం జరుగుతోందనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



బైరవునిపల్లిలో గొడవ పడుతున్న రైతులు

వచ్చే సీజన్ నాటికి యంత్రాల మరమ్మతులు

- ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ ఫ్యాక్టరీల్లో వినియోగిస్తున్న యంత్రాలు పటిష్టంగా పని చేసేందుకు అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ఉన్నతాధికారుల నుంచి అనుమతితో వచ్చే సీజన్ నాటికి పనులు పూర్తి చేస్తామని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ప్లాంట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీలను సందర్శించారు. గెలల క్రషింగ్ చేసే యంత్రాల పనితీరు, మరమ్మతులపై సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కల్యాణ్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

అన్నం ఆశ్రమానికి రూ.లక్ష విలువైన బియ్యం, సామగ్రి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రమానికి భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగులు గురువారం రూ.లక్ష విలువైన బియ్యం, ఇతర సామగ్రి అందజేశారు. పీవీకే – 5 ఇంక్లైన్‌కు చెందిన 800మంది ఉద్యోగులు తమ వేతనం నుంచి ప్రతీనెల సేవా కార్యక్రమాలు చేపడుతుండగా ఈసారి అనాథలకు చేయూతనిస్తున్న అన్నం ఫౌండేషన్‌కు సామగ్రి అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, సింగరేణి అధికారులు, ఉద్యోగులు షాలెం రాజు, రవీందర్, పాలడగు శ్రీనివాస్, శ్యాంప్రసాద్, హరీష్, రాజయ్య, శ్రీనివాస్,శంకర్, కృష్ణ, సందీప్, వినోద్, కడివెండి వేణుగోపాల్ పాల్గొన్నారు.



సామగ్రితో ఉద్యోగులు, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సత్తుపల్లిలోని పాత ఎన్టీఆర్ కాల్వ ఒడ్డున నివాసముండే అరవపల్లి అమరయ్య(75) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన గురువారం ఇంటి సమీపంలోని ఓ పాకలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆయనకు భార్య రాములమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి సీఐ టి.కిరణ్ తెలిపారు.

ఫోన్ చూడొద్దన్నందున బాలిక..

కామేపల్లి: ఫోన్ చూడొద్దని తల్లి మందలించిడంతో మనస్తాపం చెందిన బాలిక ఎలుక మందు తినగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మండలంలోని పండితాపురానికి చెందిన బత్తుల విజయలక్ష్మి(15) స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. దీపావళి పండుగ రోజున ఆమె ఫోన్ చూస్తుండగా తల్లి నాగమణి మందలించింది. దీంతో బాలిక మనస్తాపం చెంది తల్లి పనికి వెళ్లాక ఎలుకల మందు తిన్నట్లు తెలిసింది. సాయంత్రం నాగమణి వచ్చేసరికి బాలిక వాంతులు చేసుకుంటుండగా ఖమ్మంకు, ఆతర్వాత హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం తెల్లవారుజామున మృతి చెందిందని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఇంటి ఆవరణలోకి దూసుకొచ్చిన వ్యాన్

పెనుబల్లి: మండలంలోని వీఎం బంజర్ ఎస్సీ కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి డీసీ ఎం వ్యాన్ దూసుకురావడంతో ఓ బాలుడికి గాయలయ్యాయి. హైదరాబాద్ నుండి విశాఖపట్నంకు గురువారం ఉదయం లోడ్‌తో వెళ్లతున్న వ్యాన్ అదుపు తప్పి వీఎం బంజరలోని శిరసాని సుధాకర్ ఇంటి ఆవరణలోకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో డ్రెయినేజీ కల్వర్టు ధ్వంసం కాగా బ్రష్ చేసుకుంటున్న ఏడేళ్ల బాలుడు యశ్వంత్‌కు రాళ్లు తాకి గాయాలయ్యాయి. అయితే, అంతకు కొద్దినిమిషాల ముందే కుటుంబీకులు ఇంట్లోకి వెళ్లడంతో ప్రమాదం తప్పినట్లయింది. కాగా, వ్యాన్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.



ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లి ఆగిన వ్యాన్

మార్కెట్‌లోనే సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి



పత్తి రైతులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సీసీఐ కేంద్రం ఏర్పాటుచేసి పత్తి కొనుగోళ్లు చేపట్టడమే కాక తేమ శాతం నిబంధన ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను గురువారం పరిశీలించిన నాయకులు ఆతర్వాత కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర దక్కకపోగా క్వింటాకు రూ.6,700 నుంచి రూ.5వేల లోపే చెల్లిస్తున్నారని తెలిపారు. ఈవిషయమై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టి సారించి సీసీఐ ద్వారా కొరీలు లేకుండా పత్తి కొనుగోళ్లు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, సంఘంతో పాటు సీసీఎం నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, ఎర్రా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, శీలం నర్సింహారావు, భూక్యా శ్రీనివాసరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్.కే.మీరా, సుదర్శన్ రెడ్డి, చెరకుమల్లి కుటుంబరావు, కోల్లేటి ఉపేందర్, బోడేపూడి వీరభద్రం, పాపినేని రాంనర్సయ్య, బండారు యాకయ్య, హిమం పాల్గొన్నారు.